క్లుప్తంగా

మైనర్లు వాహనాలు నడపొద్దు

జంగారెడ్డిగూడెం: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ వి.కృష్ణబాబు హెచ్చరించారు. జంగారెడ్డిగూడెంలో శనివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలు నడుపుతున్న మైనర్‌లను గుర్తించి, వారిని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణబాబు మాట్లాడుతూ స్పెషల్‌డ్రైవ్‌లో ఆరు మోటార్ సైకిళ్లను సీజ్ చేశామని, మైనర్‌లకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై ఆర్.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో తనిఖీలు



బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నామని డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెంలో శనివారం ఆయన విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఉగ్రదాడులు నేపథ్యంలో అసాంఘిక శక్తుల ఉనికి లేకుండా పట్టణంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. లాడ్జీలు, బస్టాండ్, జన సమర్ధం ఉన్న ప్రాంతాలు, అనుమానిత ప్రాంతాల్లో పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు చేశామన్నారు. అనుమానిత వ్యక్తులతో పాటు, గంజాయి, సారా, మద్యం రవాణా, మదక ద్రవ్యాల రవాణా తదితర వాటిపై కూడా తనిఖీలు చేపట్టామని వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎటువంటి కార్యకలాపాలైనా ఉపేక్షించేది లేదన్నారు. డీఎస్పీ వెంట ఏఎస్సై వై.మంగయ్య, ఎన్ ఉమామహేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు. మండలంలోని లక్కవరంలో ఎస్సై డి.శశాంక ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేశారు.

తోపుడు బండి బహూకరణ



తోపుడు బండిని అందిస్తున్న సభ్యులు

జంగారెడ్డిగూడెం: స్థానిక డాంగే నగర్‌కు చెందిన చేను సత్యవతి, రాజు దంపతుల జీవనోపాధికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రూ.15 వేలు విలువైన తోపుడు బండిని అందజేశారు. లయన్స్ సభ్యులు లయన్ కన్నం హనుమంతరావు, ప్రెసిడెంట్ లయన్ సెక్రటరీ కొండపల్లి పండు, లయన్ జెడ్‌సీ మద్దిపాటి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుల బహూకరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక న్యూ మాంక్స్ కుంగ్‌ఫు డోజోలో కలర్ బెల్ట్స్ టెస్ట్, అవార్డింగ్ ప్రోగ్రామ్ శనివారం నిర్వహించారు. ఈ టెస్ట్‌లో వైట్, యెల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్ట్స్ సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బెల్ట్స్ బహూకరించారు. ముఖ్య అతిథి సీఐ వి.కృష్ణబాబు చేతులు మీదుగా విజేతలకు సర్టిఫికెట్లు, బెల్టులను అందజేశామని కుంగ్‌ఫూ మాస్టర్ గంధం సురేష్ తెలిపారు.

కన్నాపురం వాసికి గిన్నిస్ బుక్‌లో స్థానం



అవార్డు అందుకుంటున్న నాగ సౌమ్య ప్రదీప్

కొయ్యలగూడెం: కన్నాపురానికి చెందిన జలగం నాగ సౌమ్య ప్రదీప్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం దక్కింది. ఆమె శుక్రవారం విజయవాడలో మెట్రో పోలిటీన్ చర్చిలో మెడల్స్, సర్టిఫికెట్లను అందుకున్నట్టు తెలిపారు. 2024 డిసెంబర్ ఒకటో తేదీన విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో హలేల్ మ్యూజిక్ స్కూల్ నుంచి బ్రదర్ అగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో 1090 మంది విద్యార్థులు పియానో స్వరాలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్లోడ్ చేయగా, 1046 మంది గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారని పేర్కొన్నారు. రికార్డును సొంతం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. 2024లో కూడా తాను ఆసియ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంజినియోస్ చార్మ్ వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్నాని గుర్తుచేశారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

బుట్టాయగూడెం: ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని మండల కేంద్రమైన జీలుగుమిల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సాయి బుచ్చారావు మాట్లాడుతూ పశువైద్యుని పాత్ర ఒన్ హెల్త్‌లో కీలకమైందని, ఆహారంగా ఉపయోగపడే పశువులకు వైద్యం చేయడం కత్తి మీద సాములాంటిదని అన్నారు. ఈ ఏడాది ప్రపంచ పశువైద్య నినాదంతో పశువుల ఆరోగ్యం కోసం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసా జ్ఞాపికలను అందజేశారు. ఇండియన్ ఇమ్యునోలాజికల్ హైదరాబాద్‌కు చెందిన వారు యాంటీ ర్యా బిస్ టీకాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది సహకారంతో వేశారు. డాక్టర్ విద్యారాణి, వీఏఎస్ ఏవీవీ సత్యనారాయణ, వీఎల్‌ఓ అమ్ములు, జేవీఓ అచ్యుతరావు, ఎల్ఎస్ఏఎస్ రాజు పాల్గొన్నారు.

పరిహారం కోసం ఎదురుచూపు

- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- అర్హులకు అన్యాయం
- నిర్వాసితుల ఆవేదన

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులు కొందరు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం కోసం స్థానికులమని నిరూపించుకొనేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తూ.. న్యాయమైన పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తునే ఉన్నారు. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో ముంపుకు గురవుతున్న కుక్కునూరు మండలంలోని పలు గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ వ్యక్తిగత, ఇంటి విలువల పరిహారం మంజూరు చేసే విషయమై 2017వ సంవత్సరంలో అధికారులు సర్వే చేశారు. ఆ సమయంలో పలువురు స్థానికేతరులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని ఆరోపణలు రావడంతో నాటి భూసేకరణాధికారి స్థానికంగా లేని వారి వివరాలను వాట్సప్ చేయాలని ప్రజలను కోరారు. దీనిని ఆసరాగా చేసుకోని అర్హుల పేర్లను కూడా కొందరు ఆకతాయిలు స్థానికులు కాదంటూ వాట్సప్ మెసేజ్‌లు పంపారు. దీంతో స్థానికంగా పుట్టి పెరిగి ఇక్కడే ఎన్నో సంవత్సరాలుగా కుల వృత్తులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పలువురి నిర్వాసితుల పేర్లను ఆర్‌అండ్‌ఆర్ పరిహారం జాబితా నుంచి తొలగించారు. ఇది జరిగి దాదాపు ఏడేళ్లు గడిచినా జాబితాలో పేర్లు కోల్పోయిన బాధితులకు న్యాయం జరగలేదు. న్యాయం కోసం బాధితులు ఎక్కని కార్యాలయం మెట్లు లేవు, కలవని ప్రజాప్రతినిధి లేదు. ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులను కలిసిన ప్రతిసారీ బాధితుల నుంచి ఆధారాలు తీసుకొని నామమాత్రపు సర్వేలతో కాలం నెట్టుకొస్తున్నారే తప్ప బాధితులకు ఒరిగింది శూన్యమే. తమ చుట్టూ ఉన్నవారు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం తీసుకొని ఆనందంగా ఉంటే.. జాబితాలో పేర్లు కోల్పోయిన వారుమాత్రం న్యాయం జరిగేదెప్పుడో అంటూ వాపోతున్నారు.



కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం

నేటికీ న్యాయం జరగలేదు



నేను పుట్టి పెరిగింది కులవృత్తి చేసుకుంటుంది కుక్కునూరులోనే. కాని నేను స్థానికుడిని కాదంటూ నా పేరును ఆర్‌అండ్‌ఆర్ జాబితా నుంచి తొలగించారు. అప్పటి నుంచి న్యాయం కోసం ఎదురు చూస్తున్నాను. నేటికి న్యాయం జరగలేదు.

– నకిరికంటి సుబ్బయ్య, కుక్కునూరు

ఎవరికి చెప్పుకోవాలో



నేను స్థానికురాలిని కాదంటూ ఆర్‌అండ్‌ఆర్ పరిహారం జాబితా నుంచి పేరును తొలగించారు. ఏడేళ్లయినా న్యాయం జరగలేదు. ఎప్పటికి న్యాయం జరుగుతుందో అర్థం కావడంలేదు. న్యాయం కోసం ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదు.

– గిరి పుష్పవతి, కుక్కునూరు

ఎక్సైజ్ దాడులు

కొయ్యలగూడెం: గవరవరంలో ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రత్తిపాటి రాజేష్‌ను అదుపులోకి తీసుకుని, 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు పోలవరం ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. ద్విచక్రవాహనాన్ని సీజ్‌చేసి, 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామన్నారు. రాజేష్‌కు సహకరిస్తున్న మరో వ్యక్తి నాయుడు శివశంకర్‌పైనా కేసు నమదు చేశామని తెలిపారు. పాత కేసుల్లో నిందితుడు రాజవరం గ్రామానికి చెందిన వేముల దుర్గారావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్

జంగారెడ్డిగూడెం: కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే ఆర్ఎస్ఎస్, బీజేపీ సర్కారు తెచ్చిన లేబర్ కోడ్ల రద్దుకు పోరాటాలను తీవ్రతరం చేద్దామని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పొగాకు బోర్డు వద్ద భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో 139వ మేడే వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు బైరెడ్డి రాము, వాసుపోయిన శ్రీను, రొయ్యల శ్రీను, బంగారు సత్తిబాబు, తన్నారి మధు, రోంగల రామదుర్గారావు, మజ్జి స్వామేలు, ఇమ్మంది రాము, వాసు బోయిన పెద్దశ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీపుష్ప యాగోత్సవం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఉపాలయమైన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు శనివారం విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం ఆలయంలో శ్రీనివాసునికి, పద్మావతి, అండాళ్ అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ యజ్ఞశాలలో హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో ద్వాదశ కోవెల ప్రదక్షిణలను వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవార్లకు శ్రీ పుష్పయాగోత్సవాన్ని అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





విశేష పుష్పాలంకారాల్లో స్వామి, అమ్మవార్లు

శ్రీపుష్ప యాగోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రుద్రాభిషేకం, శనిత్రయోదశి పూజలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఉపాలయం, క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి, శనిత్రయోదశిని పురస్కరించుకుని విశేష కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు గర్భాలయంలో కొలువైన శివయ్యకు వేద మంత్రోచ్ఛరణల నడుమ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పూజజలు చేసి హారతులిచ్చారు. ఆలయ ఆవరణలోని నవగ్రహాలకు పూజలు చేసి, తైలాభిషేకాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం గంగా, పార్వతీ సమేత శివయ్య నంది వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు.



శివయ్యకు అభిషేకం చేస్తున్న అర్చకుడు

రెండో విడత రీ సర్వే ప్రారంభం

లింగపాలెం: రీ సర్వే రెండో ఫేజ్‌లో పుప్పాలవారి గూడెం గ్రామాన్ని గుర్తించి భూ కొలతలను ప్రారంభించామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. శనివారం పుప్పాలవారిగూడెంలో రైతులకు రీసర్వేపై రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ఈ గ్రామంలో 766 ఎకరాల్లో భూమిని రీ సర్వే చేసి పొలాల్లో సరిహద్దులు ఏర్పాటు చేసి రైతులకు అప్పగిస్తామని తహసీల్దార్ తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగబాబు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు



వెంకటేశ్వరస్వామికి పూజ చేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. పోలిరెడ్డి వెంకట సత్యనారాయణ, వెంకట నాగమణి (పీవీఎస్ ట్రేడర్స్) దంపతులు అన్నప్రసాద వితరణ చేశారని ఈఓ మానికల రాంబాబు తెలిపారు. గిరిప్రదక్షిణ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాని చెప్పారు.

మద్దిలో పూజలు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శించుకున్నారు. స్వామివారికి వివిధ సేవలు, విరాళాల ద్వారా మధ్యాహ్నం వరకు రూ.1,34,242 సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్‌వీ చందన తెలిపారు.

వివాహానికి ఆర్థిక సాయం

కొయ్యలగూడెం: పేద కుటుంబంలో వివాహానికి రామానుజపురం సర్పంచ్ అడపా నాగలక్ష్మి, రాంబాబు దంపతులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆవుల సుబ్బారావు, పెద్దింట్లు దంపతులు తమ కుమార్తెకు వివాహం కుదుర్చుకున్నప్పటికీ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలుసుకొని శనివారం ఈ సాయం అందజేశారు. గత ఆరేళ్ల కాలంలో ఇప్పటి వరకు రూ.4 లక్షల సొమ్మును ఈ విధంగా వారు పలువురు పేదింటి వధువుల వివాహం కోసం సాయంగా అందజేయడం గమనార్హం.

మృతుల కుటుంబాలకు పరామర్శలు



బుట్టాయగూడెం : నాగరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలరాజు



కొయ్యలగూడెం : రామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలరాజు

బుట్టాయగూడెం: ఇటీవల కారు ప్రమాదంలో మృతి చెందిన కుంజా నాగరాజు మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని బూరుగువాడలో శనివారం నాగరాజు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగరాజు పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. నాగరాజు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జోడే సత్యదుర్గాప్రసాద్, నాయకులు కుంజం భూమయ్య, తెల్లం భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

రామరాజుకు నివాళి

కొయ్యలగూడెం: కోసూరు రామరాజు మృతి వైఎస్సార్ సీపీకితీరని లోటని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కన్నాపురంలోని రామరాజు నివాసానికి వెళ్లి శనివారం బాలరాజు పార్టీ నాయకులతో కలిసి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. పార్టీకి రామరాజు చేసిన కృషిని గుర్తుచేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు డాక్టర్ శ్రీనివాస్, ఉప్పల కృష్ణ, ఎండీ షాబాజ్, అంబటి శ్రీను, కేశవ, ఎస్‌కే సిరి, మందపాటి రామకృష్ణ, నండూరి వీరబాబు, సొంగ కిషోర్, కలపాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

గంగన్నగూడెం మొక్కజొన్న చేనులో అగ్నిప్రమాదం

కొయ్యలగూడెం: గంగన్నగూడెంలో షార్ట్ సర్క్యూట్ వల్ల మొక్కజొన్న చేనుకు నిప్పంటుకుంది. శనివారం మధ్యాహ్నం ఆకుల బాలకృష్ణ అనే రైతుకు చెందిన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా మొక్కజొన్న చేనుకు నిప్పంటుకుంది. కండెలు ఒలిచే దశలో పంటను కాపాడుకునేందుకు కాడికట్టు రైతులు వెంటనే దుక్కి దున్నే ట్రాక్టర్లను ఏర్పాటు చేసి మంటలు ఎగసిపడుతున్న ప్రాంతం చుట్టూ దున్నివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది. రైతుల సమయస్ఫూర్తితో సమీపంలోని సుమారు 200 ఎకరాలకు పైగా ఉన్న మొక్కజొన్న పంటలు అగ్నిప్రమాదం నుంచి బయటపడ్డాయి.

రఘురామ బహిరంగ క్షమాపణ చెప్పాలి

జంగారెడ్డిగూడెం: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. శ్రీనివాసరావుపై రఘురామకృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను ఖండించింది. ఈ మేరకు శనివారం జంగారెడ్డిగూడెంలో పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షత నిరసన వ్యక్తంచేశారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గం పాలకోడేరు గ్రామంలో పేదలకు న్యాయం చేయాలని పర్యటించిన సందర్భంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై రఘురామ కృష్ణంరాజు దుర్భాషలాడడాన్ని తప్పు పట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తెల్లం దుర్గారావు, మండల కమిటీ సభ్యులు జి.సూర్య కిరణ్, కె.సుబ్బారావు, బి.నాని, నల్లంటి భద్రయ్య, కె.సత్యనారాయణ, డి.ఆశీర్వాదం పాల్గొన్నారు.

విమర్శించే నైతిక హక్కు రఘురామకు లేదు

బుట్టాయగూడెం: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్‌ను విమర్శించే హక్కు డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుకు లేదని సీపీఎం జీలుగుమిల్లి మండల కమిటీ నాయకులు చిట్టిబాలమ్మ కొండలరావు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రఘురామ కృష్ణంరాజు అసభ్యకరంగా బెదిరిస్తూ దూషించడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. రఘురామ కృష్ణంరాజు తీరును ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కారం దుర్గ, తుంకపల్లి శేషగిరిరావు, జక్కుల వెంకటేశ్వరరావు, దాసరి రామారావు, బి.రమణ, తదితరులు పాల్గొన్నారు.



రఘురామ వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం

కొయ్యలగూడెం: జీవావళికి ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరమని సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి పేర్కొన్నారు. శనివారం బయన్నగూడెంలోని సాయి కృష్ణ గోశాల వద్ద ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి సంజీవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలు (నవధాన్యాలు) పచ్చిరొట్ట పెంపకం, దాని ఉపయోగాలపై చర్చించారు. ఈ విధానాలు పాటించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. నవధాన్యాల కిట్లు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులు సుంకర సత్తిరాజు, బాలం గంగాధర్, తలారి పోతురాజు, మల్లబత్తుల నాగరాజు, రొక్కం వెంకటేశ్వరరావులను సన్మానించారు. రైతులకు నవధాన్యాలు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుజాత, రవి, పాపారావు, సావిత్రి జ్యోతి, దివ్య, ఆశ వర్కర్లు అంగన్‌వాడీ సిబ్బంది మహిళా సంఘ సభ్యులు రైతులు పాల్గొన్నారు.



బయ్యనగూడెంలో రైతులకు సన్మానం

ప్రకృతి వ్యవసాయమే మేలు

ద్వారకాతిరుమల: పురుగు మందులు, రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి గుల్లబారిపోయి, భవిష్యత్తులో పంటలు పండించడానికి పనికిరాకుండా పోతుందని ప్రకృతి వ్యవసాయ సాగుదారులు రవీంద్ర, మురళి మధుసూదన్‌రావు, రాజబాబులు పేర్కొన్నారు. మండలంలోని వేంపాడు పంచాయితీ కార్యాలయ ఆవరణలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సేంద్రియ సాగు చేస్తున్న పలువురు రైతులను సత్కరించారు.



వేంపాడులో సత్కారం పొందిన రైతులు

గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం

కొయ్యలగూడెం: శాఖ గ్రంథాలయంలో ఈ నెల 25 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రరీయన్ యు.రాముడు తెలిపారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు, ఆటవిడుపు శిక్షణ తరగతులకు శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. జూలై 6 వరకు స్పోకెన్ ఇంగ్లిష్, చెస్, డ్రాయింగ్, డాన్స్ క్రాఫ్ట్ వర్క్ మొదలగు వాటిని నిష్ణాతులైన గురువులచే నేర్పిస్తామని తెలిపారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



హెల్మెట్ ధారణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

లింగపాలెం: హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సీఐ సీహెచ్ రాజశేఖర్, ఎస్సై వెంకన్న అన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే మేలుపై స్థానికంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్టు ధరించాలన్నారు. ఈ సందర్భంగా వాహనచోదకులతో ప్రతిజ్ఞ చేయించారు.

పహల్గాం మృతులకు నివాళి



జంగారెడ్డిగూడెం : కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు



బుట్టాయగూడెం : కొవ్వొత్తుల ర్యాలీ



చింతలపూడి : రజకసంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

జంగారెడ్డిగూడెం: పహల్గాంలో ఉగ్రమూకలు చేసిన వికృత దాడిని ప్రతి భారతీయుడూ ఖండించాలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ నాయకులు అన్నారు. స్థానిక ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో పొట్టి శ్రీరాముల విగ్రహం నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. మృతులకు నివాళులర్పించారు. ఉగ్రవాదుల వికృత చర్యతో 26 మంది అమాయకులు అశువులు బాసారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు సీహెచ్‌ఆర్ సత్యనారాయణ, మండవల్లి సోంబాబు, పత్తి శేఖర్, చిన్ని హరీష్‌గుప్త, ఏలూరి ఫణికుమార్, నాగసూరి వీర వసంతకుమార్, పసుమర్తి సాయి, గుడిమెట్ల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులు ఆధ్వర్యంలో

స్థానిక కొత్త బస్టాండ్ నుంచి బోసు బొమ్మ సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు పేరూరి భద్రయ్య, కార్యదర్శి దొమ్మేటి సత్యనారాయణ, కోశాధికారి తగరం సత్యం, గౌరవాధ్యక్షులు రాఘవరావు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరావు, రావూరి కృష్ణ, సీహెచ్ రామలింగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి నిరసనగా ర్యాలీ

బుట్టాయగూడెం: కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అమాయక ప్రజలపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శనివారం బుట్టాయగూడెంలో వివిధ ప్రజలు, కూటమి నాయకులు, పోలీసులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో కాశ్మీర్ ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ ర్యాలీ చేశారు. టెర్రరిజంపై ఉక్కుపాదం మోపాలని నినదించారు. కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కరాటం ఉమా మహేశ్వరరావు, కొండేపాటి రామకృష్ణ, వంకా కాంచన మాల, బాలు, మాటూరి ముసలయ్య, ఓదూరి దుర్గారావు పాల్గొన్నారు.

ఉగ్రవాదం నశించాలి

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పహల్గాంలో జరిగిన అమానుష ఉగ్రవాద దాడిని ఖండిస్తూ శనివారం నిరసన తెలిపారు. ఉగ్రవాదం నశించాలి, మానవత్వం వర్ధిల్లాలని అధ్యాపకులు, విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఉగ్ర దాడి వ్యక్తులపై కాదని, యావత్తు భారత ప్రజాస్వామ్య విలువలపై దాడిగా భావించాలని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జేకే నరేంద్ర కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రజక సంఘం నివాళి

పెహల్గాంలో విద్రోహులు చేతులలో మరణించిన భారతీయులకు రజక సంఘం నివాళులర్పించింది. ఉగ్రవాదుల చర్యకు జవాబుగా విద్రోహులను మట్టుపెట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. రజక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పగడాల సాంబ శివరావు, చింతలపూడి పట్టణ అధ్యక్షులు పులిగడ్డ ప్రసాద్, గౌరవ అధ్యక్షులు నారాయణ, కార్యదర్శి చెన్నారావు, కోశాధికారి బండి సూరిబాబు పాల్గొన్నారు.